క్లుప్తంగా

లెప్రసీ సర్వే

రాజోళి: మండలంలోని తుమ్మిళ్లలో రాజోళి పీహెచ్‌సీ బృందం సభ్యులు లెప్రసీ సర్వే నిర్వహించారు. జాతీయ కుష్ఠు నిర్మూలనలో భాగంగా ఇంటింటికి తిరిగి వ్యాధి లక్షణాలను గుర్తించారు. శరీరంపై అనుమానంగా ఉండే గోదుమ, ఎరుపు రంగు మచ్చలు, స్పర్శ లేకుండా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ జయప్రకాష్, రంజిత్ కుమార్, రాజేశ్వరి, రామలక్ష్మి, జగన్నాథ్ పాల్గొన్నారు.

శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు

అయిజ: పట్టణ సమీపంలో అభయాంజనేయ స్వామి ఆలయం పక్కన నూతనంగా నిర్మించిన శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠకు వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ప్రాతఃకాలపూజ, అభిషేకం, జపాలు, హోమాలు, హారతి, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. ప్రతిరోజు భక్తులకు తీర్థప్రసాద వితరణతోపాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

వర్షం కోసం ప్రత్యేక ప్రార్థన



మానవపాడు: కొన్ని రోజులుగా వర్షాలు పడకపోవడంతో వర్షం కురవాలని బుధవారం మండలంలోని అమరవాయిలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు సిరాజ్‌అహ్మద్, మహ్మద్, రియాజ్, రఫీ, మాలిక్ పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని మారమునగాల–2 గ్రామ శివారులోని పంట పొలంలో ముస్లింలు వర్షం కోసం ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. వర్షాలు లేక పంటలు ఎండుతున్నాయని, నీటి కోసం రైతుల ఇబ్బందులు తొలిగేలా చూడాలని దేవుని ప్రార్థించారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



రాజోళి: అర్చకుల వేతనాలు పెంచిన సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి బుధవారం మండల కేంద్రంలో అర్చకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరేంద్రాచార్యుడు మాట్లాడుతూ అర్చకుల వేతనాలు పెంచుతూ ప్రభుత్వం జీఓ జారీ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అడివి స్వామి, బసవరాజు, బ్రహ్మయ్య, నాగరాజు పాల్గొన్నారు.

లాఠీచార్జి చేయడం సిగ్గుచేటు

గద్వాల అర్బన్: డీఎస్సీ అభ్యర్థులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని, శాంతియుతంగా నిరసన చేస్తున్న వారిని అడ్డుకొని లాఠీచార్జి చేయడం సిగ్గుచేటని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీం పాషా అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీ అభ్యర్థులపై చేసిన లాఠీచార్జిని తీవ్రంగా ఖండించారు. వెంటనే ఖాళీగా ఉన్న 13,500 ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, లేదంటే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

పోలీసు స్టేషన్ సందర్శించిన విద్యార్థులు

గద్వాల క్రైం: మండలంలోని చేనుగోనిపల్లికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్‌ఐ ఆనంద్ స్టేషన్ సిబ్బంది పలు అంశాలను విద్యార్థులకు వివరించారు. అత్యవసర సమయల్లో సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేస్తూ శాంతియుత వాతావరణం కల్పించి వారిలో మనోధైర్యం అందించే విధంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

టిప్పర్లను ఆపి నిరసన

గట్టు: మండల కేంద్రం బస్టాండ్ వద్ద టిప్పర్లను ఆపి వ్యాపారస్తులు, గ్రామస్తులు నిరసన తెలిపారు. నిత్యం టిప్పర్ల కారణంగా రోడ్లపై దుమ్ములేస్తూ, గుంతలు పడి ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. భారత్‌మాల, గట్టు ఎత్తిపోతల పథకం పనులకు సంబంధించిన టిప్పర్లను మాచర్ల రూట్‌లో తిరుగుతున్న కారణంగా దుమ్ము, ధూళి వల్ల అనారోగ్యానికి గురవుతున్నట్లు గ్రామస్తులు వాపోయారు. అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరారు.

సబ్సిడీ గొర్రెలను సద్వినియోగం చేసుకోండి

అయిజ: ప్రభుత్వం సబ్సిడీలో అందిస్తున్న గొర్రెల యూనిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని వెటర్నీ అసిస్టెంట్ సర్జన్ స్వరూప రాణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆరు యూనిట్ల గొర్రెలను లబ్ధిదారులకు ఆమె పంపిణీ చేశారు. గొర్రెలకు సంబంధించిన దాణాను ప్రభుత్వం అందిస్తుందన్నారు.

పాఠశాలల్లో రాఖీ వేడుకలు

మానవపాడు: మండలంలోని కలుకుంట్లలో బుధవారం అంగన్‌వాడీ సెంటర్‌లో ఆనందోత్సవాల మధ్య రాఖీ పండగను అంగన్‌వాడీ టీచర్ ఆదిలక్ష్మి ఘనంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సోదర భావంతో మెలగాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో చిన్నారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి ఏకశిల పాఠశాలలో బుధవారం డైరెక్టర్ విష్ణు ఆధ్వర్యంలో రక్షా బంధన్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు విద్యార్థినీలు సామూహికంగా రాఖీలు కట్టారు. కార్యక్రమంలో క్యాంపస్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ రామాంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె శ్రీరాఘవేంద్ర పాఠశాలలోని బుధవారం ముందస్తుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు రక్షా బంధన్ వేడుకలు



నందిన్నె పాఠశాలలో రాఖీలు కడుతున్న విద్యార్థినులు

నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోదర, సోదరిమణుల మధ్య ఉన్న ప్రేమను తెలియజేసేది రాఖీ పండుగని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవేంద్ర, వెంకటేష్, స్వామి, భారతి, నవిత ఉన్నారు.

ధరూరు: అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షా బంధన్ వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ కాన్సెప్ట్ పాఠశాలలో చిన్నారులు రాఖీలు కట్టి స్వీట్లు పంచుకున్నారు.

అలంపూర్ రూరల్: మండలంలోని గ్రామాల్లో ఘనంగా రాఖీపౌర్ణమి నిర్వహించారు. బుధవారం అన్నకు చెల్లెలు, అక్క తమ్మునికి రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు.



ఏకశిల పాఠశాలలో..



కలుకుంట్లలో..



ధరూరులో..

18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మంజుల

అలంపూర్ రూరల్: 18 ఏళ్ల నిండిన యువతీ యువకులను ఓటరుగా నమోదు చేయించాలని తహసీల్దార్ మంజుల అన్నారు. పట్టణంలోని ఐకేపీ భవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బేగం అధ్యక్షతన నిర్వహించారు. వ్యవసాయ శాఖకు ఆగస్టు 22–23 వరకు రైతుబీమాకు 34మంది రైతు కుటుంబాలు దరఖాస్తు చేసుకోగా, 30మందికి రూ.5 లక్షల చొప్పున రూ1.5 కోట్లు నామిని ఖాతాలో జమైనట్లు పేర్కొన్నారు. నాలుగురివి ఎల్ఐసీ క్లైమ్‌లు ప్రాసెస్‌లో ఉన్నట్లు తెలిపారు. గోపాలమిత్ర సబ్ సెంటర్లు గొందిమల్ల, సుల్తాన్‌పూర్, కాశీపూర్, భీమవరం గ్రామాల్లో ఉన్నట్లు అధికారి తెలిపారు. విద్యాశాఖలో 13 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపాపరు. మహిళా గ్రామ సంఘాలు 17, స్వయం సహాయక సంఘాలు 404, వికలాంగుల సంఘాలు 6 ఉన్నట్లు సమైక్య అధికారి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోవిందరావు, ఎంఈఓ అశోక్‌కుమారు, తహసీల్దార్ మంజుల, సూపరింటెండెంట్ రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

‘సమగ్ర శిక్ష’ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

గద్వాల : జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణం క్రమబద్ధీకరించాలని వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్‌ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్‌ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్లకార్డులతో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ సరిత ఉద్యోగులతో మాట్లాడారు. నుద్దేశించి మాట్లాడారు. 20 ఏళ్లుగా పని చేస్తూ గురుకులాలతో సమానంగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నా శ్రమకు తగిన వేతనం ఇవ్వడం లేదని విమర్శించారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం నర్సింహ, సీపీఐ ఆంజనేయులు, నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు రంజిత్‌కుమార్‌లతో పాటు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడారు.



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సరిత

మీడియా అసోసియేషన్ సమావేశం



రాష్ట్ర అదహాక్ కమిటీ సభ్యుడిని సన్మానిస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్(టీఈఎంఏ) సన్నాహక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అడహాక్ కమిటీ సభ్యులు అహ్మద్‌హాజరై మాట్లాడారు. అసోసియేషన్ ఉద్దేశం, లక్ష్యాలను వివరించారు. ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, అక్రమ కేసులతో ఇబ్బందులపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అడహాక్ కమిటీ సభ్యులను సన్మానించారు. సమావేశంలో ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు శంకర్, సందీప్ రెడ్డి, నరసింహ, ఖలీల్, లక్ష్మీకాంతారెడ్డి, శ్రీను, రసూల్, లిమ్రు, రాము, రఫీ, ఖయ్యూం, అభిలాష్, రమణ ఉన్నారు.

12న ఎల్ఐసీ ఉద్యోగుల సమ్మె

గద్వాల అర్బన్: ఎల్ఐసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నేరవేర్చాలని సెప్టెంబర్ 12న రెండు గంటల పాటు సమ్మెను చేపడుతున్నట్లు గద్వాల ఎల్ఐసీ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు తెలిపారు. బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఫ్యామిలీ పెన్షన్ 15నుంచి 30శాతానికి పెంచాలని, కొత్త విధానంలో మేనేజ్‌మెంట్ కంట్రిబ్యూషన్ 10నుంచి 14శాతానికి పెంచాలని, ఎల్ఐసీ ఉద్యోగులకు వేతన సవరణ బకాయి విడుదల చేయాలని, ఎల్ఐసీలో కొత్త రిక్రూట్‌మెంట్ చేపట్టాలని తదితర డిమాండ్లతో సెప్టెంబర్ 12న రెండు గంటల పాటు సమ్మె చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో గంజిపేట కిశోర్, బషీర్, సూరజ్, శేఖర్, పద్మావతి, రాఘవేంద్ర, అమరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న బంగి రంగారావు

ఎన్నికలకు సిద్ధం కావాలి

ధరూరు: రాబోయే ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ సరితారాణి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌ఓలు, సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం

గద్వాల: వంట గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపుపై బీజేపీ మహిళా మోర్చా నాయకలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం వైఎస్సాఆర్ చౌరస్తాలో ప్రధాని మోడీ చిత్రపటానికి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి పాలాభిషేకం చేశారు.

సిబ్బందికి అభినందన

గద్వాల క్రైం: కానిస్టేబుల్ నుంచి హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతిపొందిన వారిని డీఎస్పీ వెంకటేశ్వర్లు బుధవారం అభినందించారు. పదోన్నతి పొందిన వారిలో నాగరాజు, వెంకటస్వామి, చెన్నకేశవులు, శ్రీధర్‌లకు తోటి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

గద్వాల: గద్వాల తిరుపతిగా వెలుగుతున్న నది అగ్రహారంలోని కల్యాణ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం బుధవారం కనుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించడానికి పట్టణానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గోవిందనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

గద్వాల: మంత్రాలయ రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలను స్థానిక షేరెల్లివీధిలోని రాఘవేంద్రస్వామి మఠంలో గురువారం నుంచి ప్రారంభమవుతున్నాయని మఠం విచారణ కర్త ప్రభాకర్ తెలిపారు. ఆరాధన మహోత్సవాల్లో భాగంగా గురువారం పూర్వారాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. శుక్రవారం మధ్యారాధన, శనివారం ఉత్తరారాధన మహోత్సవాలను ఉంటాయని, ప్రతిరోజు ఉదయం 5గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు పూజాలు నిర్వహిస్తామని చెప్పారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

శాంతినగర్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన వడ్డేపల్లి మండలంలోని కొంకలలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొంకల గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్(19) పదేళ్లుగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. మంగళవారం రాత్రి 9గంటలకు మూర్ఛ రావడంతో ఇబ్బందులకు గురయ్యాడు. తీవ్ర మనస్తాపంతో బుధవారం ఉదయం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని తండ్రి వెంకట్రాముడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎంటర్‌ప్రైజెస్ పేరుతో మోసం

ఉండవెల్లి: మండలంలోని బొంకూరులో రెండు నెలల నుంచి ఎంటర్ ప్రైజెస్ స్లిప్‌ల్లో రూ.100లను 1000 మందితో ఊరూరా తిరిగి కట్టించుకున్నారు. ఈ నెల 30న లక్కీడిప్ తీస్తామని నమ్మబలికారు. బుధవారం వారు చెప్పిన స్థలానికి చాలా మంది వచ్చారు. ఒక్కొక్కరు ఐదు స్లిప్‌లు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అక్కడ ఎవరూ సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఉండవెల్లి, మానవపాడు మండలాల్లోని బాధితులు ఉండవెల్లి మండలంలోని బొంకూర్‌కు వెళ్లి కట్టించుకున్న వారిని నిలదీశారు. దీంతో రూ.100కు రూ.200 కట్టిస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. ఎస్‌ఐ బాల్‌రాజును వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

ఇసుక డంపులు సీజ్

రాజోళి: మండలంలోని మాన్‌దొడ్డిలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను పోలీసులు బుధవారం సీజ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా తుంగభద్ర నది నుంచి తీసుకొచ్చి డంపు చేసిన ఇసుకను పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కలిసి సీజ్ చేశారు. ఇసుక అక్రమ రవాణాపై సమాచారం ఇచ్చిన యువకుడికి దాడులు జరిగాయంటూ సోషల్ మీడియాలో, పత్రికల్లో వచ్చిన కథనాల అనంతరం ఈ దాడులు జరగడంతో ప్రత్యేక చర్చ కొనసాగుతోంది.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు

ఎర్రవల్లిచౌరస్తా: అజాగ్రత్తతో లారీ నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదైన ఘటన కోదండాపురం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణదేవ కథనం మేరకు.. కర్నూల్ జిల్లాలోని ఆత్మకూరుకు చెందిన సులేమన్ తన భార్య జాస్మిన్‌తో కలిసి తమ కారులో మంగళవారం ఉదయం స్వగ్రామం నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో ఉదయం 11 గంటలకు జాతీయ రహదారిపై బోరవెల్లి స్టేజీ సమీపంలోకి రాగానే వారు ప్రయాణిస్తున్న కారును కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ వెనక నుండి అతివేగంతో, అజాగ్రత్తగా వచ్చి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జాస్మిన్‌కు తీవ్ర గాయాలు కాగా.. సులేమన్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఇరువురిని కర్నూల్‌కు తరలించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బీఎస్పీ నాయకుల ముందస్తు అరెస్ట్

శాంతినగర్: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపుమేరకు సూర్యపేటకు బయల్దేరుతారనే సమాచారంతో ఆపార్టీ నాయకులను శాంతినగర్ పోలీసులు బుధవారం ఉదయం ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన వారిలో బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధుగౌడ్, నాగజ్యోతి, శోభగౌడ్, మల్లీశ్వరి, వీరన్న, ప్రభుదాస్, జలంధర్, యువరాజ్, వెంకటేశ్వర్లు, మహేందర్ ఉన్నారు.

బీఎస్పీ నాయకుల నిరసన..

అయిజ: బీఎస్పీ నాయకులు అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీఎస్పీ మండల ఇన్‌చార్జ్ ప్రేమ్‌కుమార్ కార్యకర్తలతో కలిసి నినాదాలు చేశారు. బీసీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో హనుమన్న, చిన్న, రాజు, ధరనాజు, సురేందర్, శశివర్మ, ఆనందరాజు, రవికుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ధరూరు: రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలతో పాటు సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పోలీసు కళాజాత బృందం సభ్యులు అన్నారు. జిల్లా ఎస్పీ సృజన ఆదేశానుసారం మండలంలోని మన్నాపురంలో బుధవారం సాయంత్రం షీ టీం, పోలీసు కళాజాత బృందం, భరోసా టీం సభ్యులు మండల ఎస్‌ఐ శివానందంగౌడ్ ఆధ్వర్యంలో ప్రజలకు, యువకులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైన వెంటనే బాధితులు 1930 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు.కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాధమ్మ, షీ టీం, కళా బృందం సభ్యులు హనుమంతు, కృష్ణ, రామాంజనేయులు, రామిరెడ్డి పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి పెద్దపీట

అయిజ: సీఎం కేసీఆర్ మున్సిపాలిటీ అభివృద్ధికి పెద్దపీట వేశారని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నర్సయ్య ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో 12 అంశాలకు ఎమ్మెల్యే ఆమోదం తెలిపారు. మున్సిపల్ అభివృద్ధి కోసం కేటాయించిన రూ.25 కోట్లు ప్రొసిడింగ్‌ను ఎమ్మెల్యే కౌన్సిలర్లకు అందజేశారు. నిధులను సద్వినియోగం చేసుకోవాలని, మున్సిపల్ అభివృద్ధికి అధికారులకు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వివిధ వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



ప్రొసిడింగ్ అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ



విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎంపీపీ మనోరమ

కేటీదొడ్డి: ప్రభుత్వం అందిస్తున్న యూనిఫాంను విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంపీపీ మనోరమ అన్నారు. మండలంలోని గంగన్‌పల్లి పాఠశాలలో బుధవారం ఎస్‌జేఆర్ డిజిటల్ జనార్దన్‌రెడ్డి విద్యార్థులకు సొంత ఖర్చులతో యూనిఫాం, టై బెల్ట్‌లు పంపిణీ చేశారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాలలో మౌలిక వసతుల కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జనార్దన్‌రెడ్డిని ఎంపీపీ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమామహేశ్వర్, శేఖర్‌రావు, జానీ, లక్ష్మీరెడ్డి, సదానందం పాల్గొన్నారు.

అలంపూర్‌ను అభివృద్ధి చేసిందే ఎమ్మెల్యే అబ్రహం

ఉండవెల్లి: ప్రతి గ్రామాన్ని అభివృద్ధిబాటలో తీసుకెళ్లింది ఎమ్మెల్యే అబ్రహం అని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు లోకేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ముందు అబ్రహం మళ్లీ ఎమ్మెల్యేగా గెలవాలని ప్రజాప్రతినిధులు కోరారు. ఎంపీపీ బీసమ్మ మాట్లాడారు. గ్రామాలను అభివృద్ధి చేయడంతో ప్రజలు ఆయనకే ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ మెంబర్ చిన్న బాస్ మియ్యా, బీఆర్‌ఎస్ సర్పంచులు బజారన్న, మద్దమ్మ, ఉప సర్పంచు సయ్యద్ రెహ్మాన్ బాషా, ఎంపీటీసీలు కురుమూర్తి, భరతసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం

గద్వాల అర్బన్: జెడ్పీ చైర్ పర్సన్ సరిత తిరుపతయ్య, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డిలపై అసత్య ఆరోపణలు చేస్తే సహించబోమని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కురువ విజయ్‌కుమార్‌పై కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి లక్ష్మణ్ ధ్వజమెత్తారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గద్వాల ప్రజలకు విజయ్‌కుమార్ ఎవరో తెల్వదని, రాజకీయ హైప్‌కోసం వ్యక్తిగత విమర్శలు, అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. కురువ విజయ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని, లేదంటే రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు. సమావేశంలో ఇమ్మానియేల్, మధు, రఘు ఉన్నారు.

రాజకీయం చేస్తున్నది బీఆర్‌ఎస్ నాయకులే

శాంతినగర్: అలంపూర్ నియోజకవర్గంలో రాజకీయం చేస్తున్నది బీఆర్‌ఎస్ పార్టీ నాయకులే అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సంపత్‌కుమార్ 15 ఏళ్లుగా ఆర్డీఎస్ మీద పోరాటం చేసినందువల్లే తుమ్మిళ్ల లిఫ్ట్‌ను ప్రభు త్వం మంజూరు చేసిందన్నారు. సమావేశంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నాగశిరోమణి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ సుజాత, జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు నాగరాజు ఉన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

అలంపూర్ రూరల్: కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా రూపకల్పనలో బీఎల్ఏ సహకారం అవసరమని, ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్డీఓ చంద్రకళ అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాబోయే శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదుపై సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్ని మండలాల తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, ఆర్ఐలు పాల్గొన్నారు.

తైక్వాండో బెల్ట్, సర్టిఫికెట్ల ప్రదానం



ధరూరు: తైక్వాండో బెల్ట్, ఎగ్జామ్ సర్టిఫికెట్లను జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి అందజేశారు. ఇటీవల గద్వాలలో తైక్వాండో స్టేట్ సెక్రటరీ శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు, మండల కోచ్ రషీద్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

గద్వాల అర్బన్: మల్దకల్ మండలంలోని విఠలాపురం గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి జెడ్పీ చైర్‌పర్సన్ సరిత కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గద్వాలలో ఒకే కుటుంబ పాలనకు స్వస్తి పలకాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండ్ల చంద్రశేఖర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, శేఖరయ్య, నర్సింహులు, సలీం, అక్బర్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లను నేరవేర్చాలని జిల్లా కేంద్రంలోని రాజీవ్‌మార్గ్ రోడ్డులో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, కృష్ణారెడ్డి, ఇమానియేల్, రాఘవేంద్ర ఉన్నారు.

పాఠశాల విద్యార్థుల విరాళం

అయిజ: పట్టణంలోని లయోలా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ కలిసి హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రెనింగ్ రిలీఫ్ రిహబిలిటేషన్ ఆఫ్ డిజెబుల్ సంస్థకు రూ.53,120 విరాళం అందజేసి ఉదారతను చాటుకున్నారు. బుధవారం పట్టణంలోని పాఠశాలలో సంస్థకు సంబంధించిన ప్రతినిధులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సన్నీ మాట్లాడారు. మానసిక, శారీరక లోపాలున్న విద్యార్థులను ఆదరించేందుకు, వృద్ధాశ్రమ నిర్మాణానికి సంస్థ నిధులు సేకరిస్తుందని తెలిపారు. తమవంతు సహాయంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో విరాళం సేకరించి సంస్థ ప్రతినిధులకు అందజేశామని పేర్కొన్నారు.



సంస్థ ప్రతినిధులకు చెక్కును అందజేస్తున్న కరస్పాండెంట్ సన్నీ